


బాబోయ్ ఎండలు..

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పట్టణంలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి ఎండ ఎక్కువగా ఉండి ఉష్ణోగ్రతలు అంతకంతకు ఎక్కువ అవ్వడంతో పనులపై బయటకు వచ్చేందుకు ప్రజలు భయపడ్డారు. ప్రధాన రహదారులన్నీ జనసం చారం లేక వెలవెలపోయాయి. మధ్యాహ్నం ఒంటి గంటకే ప్రధాన రహదారి కానుకుని ఉన్న వాణిజ్యసముదాయాలను మూసివేసి వ్యాపారులు ఇళ్లకే పరిమితమయ్యారు. సాయంత్రం 6 గంటల దాటిన తర్వాత షాపును తీసేందుకు బయటకు వచ్చారు. జూన్‌లో కూడా ఈ విధంగా ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు భయభ్రాంతులవుతున్నారు.



నిర్మానుష్యమైన పట్టణం

ఒకప్పుడు ప్రకృతి వనరు ఉచిత వస్తువు. ప్రకృతి వనరైన తాగునీరు నేడు ఖరీదైన వస్తువుగా మారింది. మినరల్ వాటర్ పేరుతో నగరంలో అక్రమంగా వెలిసిన నీటి ప్లాంట్లు కోట్లలో వ్యాపారం చేస్తున్నాయి. ఇలా నగరంలో వందకు పైగా అక్రమ వాటర్‌ప్లాంట్లు ఉన్నాయి.

అనుమతుల్లేకుండా..

కోట్లలో నీటి వ్యాపారం

అడుగంటుతున్న భూగర్భ జలాలు

పుట్టగొడుగుల్లా వాటర్‌ప్లాంట్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల నగరంలో పుట్టగొడగుల్లా అక్రమ వాటర్‌ప్లాంట్‌లు వెలిస్తున్నాయి. నగరంలో సుమారు వందకు పైగా వాటర్‌ప్లాంట్‌లు ఉన్నాయి. ఒక్క తోటపాలెం, ప్రదీప్ నగర్ ప్రాంతంలోనే ఆరు వరకు ప్లాంట్‌లు ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్ధం చేసువాల్సిందే. జనావాసాల మధ్య వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయ కూడదని ప్రభుత్వ నిబంధన. ఒక వేళ ఎవరైనా అధికారులను మభ్య పెట్టి, లేదా రాజకీయ పలుకబడితో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే అది అక్రమమే అవుతుంది. వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన వారు 5హెచ్‌పి లేదా ఆ పైన మోటారు వాడుతున్నారు. 500 అడుగులు ఆపైన లోతులో బోరు తవ్వి నీటిని అమ్ముతున్నారు. దీంతో 500 అడుగుల లోపు ఉన్న మోటార్లన్నీ వేసవిలో ఎండిపోతున్నాయి. ఈనేపథ్యంలో జన నివాసాలలో రూ.50లక్షలు కట్టుకున్న ప్లాట్లలో ఉందామంటే నీరులేక, అద్దెకి ఎవ్వరూ తీసుకోక యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అనుమతులు లేకుండానే అధికార పార్టీ అండతో ప్లాంట్లు ఏర్పాటు చేస్తూ కోట్లాది రూపాయల నీటి వ్యాపారం చేస్తున్నారు. ఫలితంగా ప్రజలు నీరులేక నానా ఇబ్బందులూ పడుతున్నారు. విజయనగరంలో కేవలం 3 వాటర్ ప్లాంట్‌లకు మాత్రమే అనుమతి ఉంది. అక్రమ వాటర్ ప్లాంట్‌ల వల్ల నీరులేక ఇబ్బందుల పాలైన ప్రాంతాల ప్రజల గోడు ప్రభుత్వానికి, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు పట్టడం లేదు.



అయ్యప్పనగర్‌లో అక్రమంగా నిర్వహిస్తున్న వాటర్‌ప్లాంట్

మరోవైపు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఈ మధ్య తరగతి ప్రజలకు ఇంటి కుళాయిలు ఇస్తామని చెప్పడం తప్ప వేసిన దాఖలాలు లేవు. అపార్ట్ మెంట్ వారికైతే ఇంటి కుళాయి కనెక్షన్లు ఇవ్వక పోవడంతో ప్రతి నీటి బొట్టును కొనుక్కోవాల్సి వస్తుంది.

పట్టించుకోని అధికారులు

ఐదేళ్ల కిందట తోటపాలెంలోను, 2 ఏళ్ల క్రితం కామాక్షి నగర్ లో కాళికా మాతా ఆలయం వద్ద అక్రమ వాటర్ ప్లాంట్‌లను రద్దు చేయాలని ప్రజలు, పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పోరాడారు, నేడు అయ్యప్ప నగర్ స్వామీ లేఅవుట్‌లో అక్రమ వాటర్ ప్లాంట్ అనుమతులు రద్దు చేయాలని పోరాడుతున్నారు. కెఎల్‌పురంలో కంది రాంబాబు ఇంటికి పక్కనే ఒక వాటర్ ప్లాంట్ ఉంది. దీంతో శ్రీనివాసం అపార్ట్ మెంట్లు, కెఎల్ పురం రెవిన్యూ కాలనీలో బోర్లు ఎండి పోతున్నాయి. తోటపాలెంలోని వైఎస్ఆర్ కాలనీలో కుళాయిలు వేయకపోవడంతో అక్కడి ప్రజలంతా చుట్టుపక్కల వాటర్‌ప్లాంట్లపై ఆధారపడుతున్నారు. ప్రస్తుతం ఎస్ విఎన్‌నగర్‌లో వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉన్న వాటర్ ప్లాంట్ పలితంగా ఎంఎస్ఎన్ కాలనీ, పిఎస్ఆర్ కాలనీతో పాటూ ఆ చుట్టూ ఉన్న ఇళ్ళల్లో బోర్లు ఇంకిపోయి ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరు తెప్పించుకునే పరిస్థితి నెలకొంది. ఇలా పుట్ట గొడుగుల్లా అక్రమ వాటర్ ప్లాంట్‌లు నగరమంతా జనా వాసాల మధ్య ఏర్పాటు చేస్తుంటే మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, జలవనరుల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

అక్రమ వాటర్ ప్లాంట్లను తక్షణమే సీజ్ చెయ్యాలి



నగరంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా వాటర్ ప్లాంట్ లు నిర్వహిస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోయి పట్టణ ప్రజలకు తీవ్ర నీటిఎద్దడిని ఎదుర్కొంటున్నారు. అయినా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, జలవనరుల శాఖ అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ నేతలే ఈ అక్ర మార్కులకు అండగా ఉన్నారని ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికీ కామాక్షీ నగర్లోని అక్రమ వాటర్ ప్లాంట్ పోరాడి సీజ్ చేయించాం. ఇప్పుడు అయ్యప్ప నగర్‌లో పోరాడుతున్నాం. ఇలా ప్రజలు పోరాడి అక్రమ వాటర్ ప్లాంట్‌ల రద్దు చేయించుకోవాలి.

– రెడ్డి శంకరరావు, విజయనగరం పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి

అయ్యప్పనగర్‌లో ప్లాంట్‌ను రద్దుచేయాలి



నగరంలోని అయ్యప్పనగర్‌లో వాటర్ ప్లాంట్ అక్రమంగా నిర్వహిస్తున్నారు. వేరొకరు రెడ్డి రామారావు అనే వ్యక్తి మా కాలనీలో బోరు తీసి ట్రాక్టర్, ట్యాంకర్లతో రోజు రాత్రి 10 తరువాత, ఉదయం 5 గంటల వరకు నీటిని తరలిస్తున్నారు. వాటర్‌ప్లాంట్ నిర్వహణకు వినియోగించే బోరు 500అడుగుల లోతున తీయడంతో చుట్టుపక్కల ఇళ్లల్లో బోర్లు ఎండిపోతున్నాయి. రూ.50లక్షలు పెట్టీ ఇళ్లు కట్టుకుంటే నీరు లేక నానా ఇబ్బందులూ పడుతున్నారు. ఈ విషయమై అధికారులు స్పందించి ప్లాంట్‌ను మూయించాలి.

-యుఎస్ రవి కుమార్,
అయ్యప్ప నగర్ పోరాట కమిటీ నాయకులు



ఎమ్మెల్యేకు ట్రాక్టర్ చెవిని అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రతి అడుగు రైతు శ్రేయస్సు కోసం : కలెక్టర్

ప్రజాశక్తి – కలెక్టరేట్

రైతు విత్తనం వేసిన నాటి నుంచి పంట విక్రయించే వరకు రైతు శ్రేయస్సు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రెండో విడత జిల్లాస్థాయి వైయస్సార్ యంత్ర సేవా పథకం మెగా మేళా కింద ట్రాక్టర్లు, కంబైన్డ్ హార్వెస్టర్లు ఇతర వ్యవసాయ పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి భరోసా కేంద్రాల పరిధిలోని కస్టమ్ హైరింగ్ సెంటర్ల రైతు గ్రూపులకు ట్రాక్టర్లు, వరి కోత యంత్రాలను రైతు వాటా కింద 50 శాతం కాగా సబ్సిడీ కింద 50 శాతం బ్యాంకులు అందివ్వనున్నాయని తెలిపారు. సబ్సిడీ సొమ్మును నేరుగా రైతు గ్రూపు ఖాతాలోకి జమ చేయడం జరుగుతుందన్నారు. వైఎస్సార్ యాత్ర సేవా పథకం రెండో విడతగా 127 కష్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి రైతులకు బ్యాంక్ ఖాతాలో తెరిపించి లబ్ధిదారులకు పారదర్శకంగా అందిస్తున్నామన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలోని వ్యవసాయ సలహా మండలి నిర్దేశించిన అద్దె మేరకు యంత్ర పరికరాలను అందజేయనున్నట్లు స్పష్టం చేశారు. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం సాధించేలా వ్యవసాయాధికారులు మెళుకువలు, సూచనలు చేయాలని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని వ్యవసాయాన్ని సులభ సాటిగా చేసుకోవాలని సూచించారు. రబీ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియను సంక్రాంతికి పండుగలోగా పూర్తి చేశామని, ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలును మరింత మెరుగ్గా కొనుగోలు ప్రక్రియను పక్కా ప్రణాళిక ప్రకారం చేపడతామని పేర్కొన్నారు. జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల పరిధిలోని 78 ట్రాక్టర్లకు యూనిట్ విలువ రూ.569.72 కోట్లు కాగా కోటీ 94 లక్షల సబ్సిడీ పొందనున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ వైయస్సార్ యంత్ర సేవా పథకం కింద ప్రభుత్వం ఆధునిక యంత్ర పరికరాలను అందుబాటులో ఉంచుతున్నారన్నారు. రైతులకు అన్ని విధాలా అండగా ఉండి రైతు పక్షపాతిగా నిలుస్తున్నారన్నారు. విపత్తుల సమయంలో రైతు నష్టపోకుండా ఇన్‌పుట్ సబ్సిడీ కింద పంట నష్టపరిహారం అందిస్తున్నారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే, కలెక్టర్ కలిసి లబ్ధిదారులకు ట్రాక్టర్లను, వరి కోత యంత్ర పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వాకాడ నాగేశ్వర రావు, ఆత్మా చైర్మన్ ఆంద్రాపు తిరుపతి, మున్సిపల్ చైర్పర్సన్ బోను గౌరిశ్వరి, ఎంపిపి మజ్జి శోభారాణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాబర్ట్ పాల్, వ్యవసాయ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారిణి పైడిరాజుకు ఆర్థికసాయం అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

డిప్యూటీ సిఎం ఔదార్యం

మహిళా క్రీడాకారిణికి ఆర్థిక సాయం


ప్రజాశక్తి – సాలూరు

డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ఔదార్యం చాటుకున్నారు. ఈ ఏడాది ఆగస్టులో శ్రీలంకలో జరగనున్న అంతర్జాతీయ మాష్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొననున్న మహిళా క్రీడాకారిణి కనకల పైడిరాజుకు ఆర్థిక సాయం అందించడానికి అంగీకరించారు. పైడిరాజు శుక్రవారం శివరాంపురం సర్పంచ్ జర్జాపు మోహన్ సహకారంతో రాజన్నదొరను ఆయన నివాసంలో కలిశారు. ఆమె జాతీయ స్థాయి పోటీల్లో సాధించిన గోల్డ్ మెడళ్లు, పతకాలు చూపించారు. ఆమెను రాజన్నదొర అభినందించారు. శ్రీలంకలో జరగనున్న అంతర్జాతీయ మాష్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనడానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఆమె ఊపిరి పీల్చుకున్నారు. పైడిరాజు పుట్టిన ఊరు మండలంలోని మామిడిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్నారు. శివరాంపురం గ్రామానికి చెందిన వ్యక్తిని వివాహమాడారు. ఎఎన్ఎంగా ప్రస్తుతం విశాఖ గీతం డెంటల్ కాలేజ్‌లో పని చేస్తున్నారు. పెళ్ళయినా, పిల్లలు ఉన్నా క్రీడల పట్ల వున్న ఆసక్తి తో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటున్నారు.

సమిష్టి కృషితో జిల్లా ఉత్తమ ఫలితాలు సాధన

ప్రజాశక్తి – పార్వతీపురం

సమష్టి కృషితో అన్ని రంగాల్లో జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. జాతీయ స్థాయిలో జిల్లాకు అవార్డులు సాధించినందుకు గానూ గురువారం రాత్రి స్థానిక రాయల్ కన్వెన్షను సెంటరు నందు జిల్లా కలెక్టరుకు జిల్లా అధికారుల సంఘం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సీతానగరం మండలం జోగింపేట పంచాయతీకి జాతీయ స్వచ్ఛ పురస్కారం, జాతీయ స్థాయిలో నీతి అయోగ్ వివిధ రంగాల అభివృద్ధికి సాధించేందుకు ఆశావాహ జిల్లాల్లో జిల్లా ఉత్తమ స్థానం అవార్డులు దక్కించుకున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను జిల్లా అధికారులు ఘనంగా సన్మానించారు. తొలుత కలెక్టరు మాట్లాడుతూ కొత్త ఏర్పడిన జిల్లా నుంచి కనీస వసతులతో ప్రస్థానం ప్రారంభించామని, ఏడాదిలో జాతీయ స్థాయిలో నాలుగు అవార్డులు సాధించామన్నారు. గతేడాది వైద్య, ఆరోగ్య శాఖ, సాలూరు మున్సిపాలిటీ జాతీయ అవార్డులు రాగా, ప్రస్తుతం జోగింపేట పంచాయతీకి జాతీయ స్వచ్ఛ పురస్కారం, నీతి అయోగ్ ఆశావాహ జిల్లాల్లో జిల్లా ఉత్తమ స్థానం సాధించడంలో కృషి చేసిన అధికారులను అభినందించారు. ఏడాదిలో జిల్లా లో పదివేల ఇళ్లు నిర్మించామని, మారుమూల ప్రాంతాలకు రోడ్లు, ఇంటర్నెట్ కనెక్టివిటీ అందించామన్నారు. 27 రోడ్లకు అటవీ శాఖ అనుమతులు సాధించామని, జిల్లాను అభివృద్ధి చేయటంలో కష్టపడి పనిచేస్తున్న జిల్లా అధికార బృందానికి అభినందనలు తెలిపారు. అందరి సమిష్టి కృషితో అన్ని రంగాల్లో జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. భవిష్యత్‌లోనూ ఇదే స్ఫూర్తితో పనిచేసి జిల్లాను అభివృద్ధి బాటలో కొనసాగించాలని కోరారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు మాట్లాడుతూ కలెక్టర్‌తో కలిసి పనిచేసిన అనుభవం ఉందని, ఏదైనా పనిని పూర్తి చేయడానికి వారు రూపొందించే ప్రణాళికలే కీలకమని, సమస్యలను లోతుగా అధ్యయనం చేసి పరిష్కారం కనుగొంటారని తెలిపారు. ఎస్‌పి విక్రాంత్ పటేల్ మాట్లాడుతూ కలెక్టర్ జిల్లాలో మంచి టీంను ఏర్పాటు చేశారని, కొత్తగా ఏర్పడిన, మారుమూల జిల్లాలో ఇటువంటి బృందంతో కలిసి ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లోనూ ఇదే స్ఫూర్తి కొనసాగాలని కోరారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఎఎస్‌పి ఒ.దిలీప్ కుమార్, డిఎఫ్ఒ ప్రసన్న మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి జిల్లా కలెక్టర్ నాయకత్వం, వారు అందించిన సూచనలు, సలహాలు, సమస్యలపై ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారం చేయడం వల్ల సాధ్యమైందన్నారు. డిఆర్ఒ జె.వెంకటరావు మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి సాధించడంలో అధికారులకు జిల్లా కలెక్టరు నాయకత్వం, అందించిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు. జిల్లా కలెక్టర్ వారి కృషితో జాతీయ అవార్డులు సాధించామని, జిల్లాలో మారుమూల ప్రాంతాలకు రోడ్లు, మొబైల్ టవర్స్ ఏర్పాటు చేసి అనుసంధానం చేశారన్నారు. రాష్ట్ర స్థాయిలో టెన్త్‌లో ఉత్తీర్ణత శాతంలో మొదటి స్థానం సాధించామని తెలిపారు. జిల్లా కలెక్టరు మార్గదర్శకత్వంలో మరిన్ని విజయాలు సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.హేమలత, అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్ నిశాంత్‌కుమార్ సన్మానిస్తున్న జిల్లా ఉన్నతాధికారులు

జిసిసి టెండర్లు నిర్వహణ

ప్రజాశక్తి – సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలో గల ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలకు నిత్యావసర వస్తువుల సరఫరాకు టెండర్లు జిసిసి ఆధ్వర్యంలో నిర్వహించారు. మొత్తం 52 వస్తువులకు టెండర్లు నిర్వహించారు. వస్తువుల సరఫరాలో ఆలస్యం ఉండకూడదని సూచించారు. సరుకుల్లో నాణ్యత లోపించకూడదన్నారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, డిడి బి.నగేష్, జిసిసి డిఎం జి.సంధ్యారాణి, ఒఎస్‌డి ఎం.యుగంధర్, ఎటిడబ్ల్యుఒలు శ్రీనివాసరావు, మంగవేణి, జిసిసి మేనేజర్లు దాసరి కృష్ణ, గొర్లె నరసింహులు, హెచ్ డబ్ల్యుఒలు అమలశారద, వెంకటనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతలో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి – పార్వతీపురంరూరల్

గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల నాణ్యతా ప్రమాణాలు పాటించడంలో నిర్లక్ష్యం వహించవద్దని ఐటిడిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ సి.విష్ణు చరణ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని బొండపల్లిలో జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం పనులను శుక్రవారం పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వం కింద గ్రామ సచివాలయం పరిధిలో నిర్మిస్తున్న సిసి రోడ్లు, మురుగు కాలువ పనులు, ఎంత మేరకు మంజూరైన జరిగిన ప్రగతిని పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ అధికారి రత్న కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాభివృద్ధికి ప్రతిష్టాత్మకంగా పనులు మంజూరు చేసినందున సకాలంలో పూర్తికి చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యతలో రాజీపడకుండా పనులను పర్యవేక్షించాలన్నారు. ప్రస్తుతం నిర్మాణ పనులకు అనుకూలమైనందున పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయితీరాజ్ ఎఇ చంద్రమౌళి, గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అందించాలని..

సచివాలయాన్ని ముట్టడించిన మహిళలు

నాలుగు రోజుల్లో నీళ్లు ఇస్తామని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి హామీ

ప్రజాశక్తి – బలిజిపేట

తక్షణమే తాగునీరివ్వాలని మండలంలోని గంగాడలో సిగిడి వీధి, కొండవీధికి చెందిన మహిళలు గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ముట్టడించారు. తాగునీటి కోసం అల్లాడిపోతున్నామని, తక్షణమే తాగునీరందించాలని అనేకసార్లు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొళాయి పైపులైన్లు ఉన్నప్పటికీ ఉత్సాహ విగ్రహంలా ఉన్నాయి తప్ప వాటి ద్వారా నీరు రావడంలేదని, తప్పని పరిస్థితుల్లో నూతి నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. ఈ నీరు తాగడం వల్ల విషజ్వరాల బారినపడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందువల్లే తప్పనిసరి పరిస్థితుల్లో సచివాలయాన్ని ముట్టడించామన్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి దాహం తీర్చాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు యమ్మల మన్మథరావు మాట్లాడుతూ తీవ్రమైన ఎండాకాలంలో తాగడానికి మంచినీరివ్వక పోవడం అన్యాయమన్నారు. దీంతో మహిళలంతా సచివాల యాన్ని ముట్టడించారన్నారు. ఈ సమస్యను నాలుగుల్లో పరిష్కరిస్తామని సర్పంచి, పంచాయతీ కార్యదర్శి హామీ ఇచ్చారు. ఈ హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న దృష్ట్యా మంచినీరందించకపోతే తక్షణమే ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో బైఠాయించిన మహిళలు

మలేరియా నివారణకు స్ప్రేయింగ్ తప్పనిసరి

ప్రజాశక్తి – కురుపాం

మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ ఎసిఎం 5 శాతం తప్పనిసరిగా చేయించుకోవాలని మలేరియా సబ్ అధికారి మోహనరావు అన్నారు. శుక్రవారం మండలంలో నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ధర్మలక్ష్మీపురం, నీలకంఠాపురం ఆశ్రమ పాఠశాల, మహేంద్రపురం లో జరుగుతున్న స్ప్రేయింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ ప్రతి ఇంట్లోనూ ముందస్తుగా మలేరియా రాకుండా స్ప్రేయింగ్ చేయించుకోవాలని దానివల్ల మలేరియా దోమలు మనుషులకు కుట్టిన తర్వాత అవి గోడల మీద వాలి పేరాలసిస్ వచ్చి చనిపోతాయని, కావున ప్రతి ఒక్కరూ ఇంటి లోపల స్ప్రేయింగ్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అమరసింహారెడ్డి, నీలకంఠాపురం గ్రామసర్పంచ్ ఎ.మన్మథరావు, వార్డులు ఒమ్మి చిలకమ్మా, పి. మల్లేశ్వరరావు సూపర్వైజర్ గౌడు శ్రీహరిరావు పాల్గొన్నారు.

మలేరియా మసోత్సవాల నిర్వహణపై సమీక్ష

సీతంపేట: మలేరియా నిర్మూలన మాసోత్సవాల నిర్వహణపై ఐటిడిఎ ఎపిఒ, డెప్యూటీ డిఎంహెచ్ఒ, డిఎల్‌డిఒ సమక్షంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ మలేరియా నిర్మూలన మాసోత్సవాలు సందర్భంగా ప్లకార్డులు, బ్యానర్లు, స్లొగన్లతో ర్యాలీలు నిర్వహించి, ప్రజలను చైతన్యపరుస్తూ అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి ఇంట్లో అనుమానితుల రక్త నమూనాలు సేకరించాల న్నారు. దోమలు పెరగకుండా శానిటేషన్ కమిటీలతో దోమలను నివారించేందుకు అవగాహన కార్యక్రమాలు, వ్యక్తిగత పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.



మలాథియన్‌ను స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

విలేజ్ శానిటేషన్ కమిటీల ద్వారా కమ్యూనిటీ భాగస్వామ్యంతో కాల్వలు శుభ్రపరుస్తూ పూడిక తీయాలని అన్నారు. గ్రామాల్లో ఆశా, అంగన్వాడీ కార్యకర్తల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. దోమతెరలు అంతా వాడేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమం విధిగా నిర్వహించాలని అన్నారు. గిరిజన గ్రామాల్లో మలాథియన్ స్ప్రే సక్రమంగా నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఒ కె.విజయ పార్వతి, డిఎల్‌డిఒ గోపాలకష్ణ, ఎంపిడిఒలు కొండపల్లి సత్యం, త్రినాధరావు, మలేరియా యూనిట్ అధికారి మోహన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త పద్ధతిలో బోధించాలి

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

కొత్త పద్ధతిలో విద్యను బోధించాలని శ్రీకాకుళం జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య అన్నారు. పట్టణంలో ఆర్‌సిఎం పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమం నిర్వహించగా శుక్రవారం డిఇఒ శిక్షణా శిబిరాన్ని సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. విద్యార్థులకు చక్కగా బోధన అందించాలన్నారు.

లోకేష్‌పై దాడి అమానుషం

ప్రజాశక్తి – సాలూరు

యువగళం పాదయాత్రలో ఉన్న టిడిపి యువనేత లోకేష్‌బాబుపై కోడి గుడ్ల దాడి చేయడం అమానుషమని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణి చెప్పారు. శుక్రవారం ఆమె తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు పాదయాత్రలో ఉన్న లోకేష్‌పై వైసిపి గూండాలు దాడి చేశారని చెప్పారు. పాదయాత్రలో లోకేష్ బాబుకు లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే అధికారపార్టీ దాడులు ప్రోత్సహిస్తోందని చెప్పారు. కడప ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపిని చిత్తుగా ఓడించినా బుద్ధి రాలేదని అన్నారు. ఇలాంటి పిల్ల చేష్టలకు టిడిపి భయపడి పోదని చెప్పారు. ఎస్పీజి రక్షణ లేకపోతే చంద్రబాబు నాయుడు ఫినిష్ అవుతారని అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం వ్యాఖ్యానించడం గర్హనీయమని అన్నారు. లోకేష్‌కు భద్రత పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిడిపి కౌన్సిలర్ వి.హర్షవర్ధన్, అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ పప్పల మోహన్‌రావు, పట్టణ నాయకులు కొనిసి చిన్ని, మండల నాయకులు ఎం.శ్యాం, పాచిపెంట నాయకులు యుగంధర్ పాల్గొన్నారు.


మంత్రి బొత్సకు జ్ఞాపికను అందజేస్తున్న ఆస్పత్రి యాజమాన్యం

శ్రీవిజయ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలోని శ్రీవిజయ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి వరమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఏలాం జంక్షన్ దగ్గర శ్రీవిజయ మల్టీస్పెషాలిటీ హాస్పటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకొండ పరిసరప్రాంత ప్రజలకు ఈ ఆసుపత్రి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం కూడా అందుబాటులో తేవడం మంచిదన్నారు. ప్రజలకు వైద్యసేవలు మరిన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపి బెల్లాన చంద్రశేఖర్, స్థానిక ఎంఎల్ఎ విశ్వసరాయి కళావతి, ఎంఎల్సి పాలవలస విక్రాంత్, డిఎస్పి జి.వి.కృష్ణారావు, నగర పంచాయతీ అధ్యక్షులు యందవ రాధాకుమారి, పల్లస్ సంస్థ అధినేత గేదెల శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.


వైద్యాధికారికి వాటర్ ప్యూరిఫైర్ అందజేస్తున్న దాత వెంకన్న

ఆస్పత్రికి వాటర్ ప్యూరిఫైర్ వితరణ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మేజర్ పంచాయతీకి చెందిన కందుల వెంకన్న తన తల్లి బంగారమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సందర్భంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి ఆమె జ్ఞాపకార్థంగా వేడి, చల్లటి నీళ్లు వచ్చే వాటర్ ప్యూరిఫైయర్‌ను శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టుపక్కల గిరిజన గ్రామాల నుంచి ఆసుపత్రికి వస్తున్న రోగులకు ఉపయోగపడేలా ఈ వాటర్ ప్యూరిఫైయర్‌ను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్య నిపుణులు కె.సందీప్ కుమార్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న టౌన్ సిఐ శ్రీనివాసరావు

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని వెలంపేట నవోదయ క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు ప్రారంభించారు. రామాకాలనీ మైదానంలో నిర్వహించనున్న ఈ టోర్నమెంట్‌ను బొన్నాడ శ్రీనివాసరావు, గుల్లిపిల్లి లోకేష్, నిక్కేల ప్రకాష్ జ్ఞాపకార్థం వెలంపేట నవోదయ సేవాసమితి ఆధ్వర్యాన నిర్వహిస్తున్నారు. మొత్తం 52 క్రికెట్ టీమ్‌లు పాల్గొంటున్నాయి. టోర్నమెంటు విజేతకు రూ.25వేలు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.15వేలు నగదు బహుమతి అందజేయనున్నారు. ఇవేకాక బెస్ట్ బ్యాట్స్ మన్, బెస్ట్ బౌలర్,బెస్ట్ వికెట్ కీపర్‌లకు బహుమతులు అందజేస్తారు. కార్యక్రమంలో రామానుజన్ గణితం క్లబ్ అధ్యక్షులు రజనీకాంత్ పాల్గొన్నారు.


కరాటే క్రీడాకారులను అభినందిస్తున్నఎస్ఐ ప్రసాద్

ఇండో-నేపాల్ కరాటేలో కురుపాం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కురుపాం

ఇండో నేపాల్ కరాటే ఛాంపియన్‌షిప్ మే 26, 27, 28 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన కరాటే పోటీల్లో కురుపాంలో కరాటే కోచ్ కె.నరేష్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న పదిమంది విద్యార్థులు అండర్-10, 14,19 విభాగాల్లో పతకాలు సాధించారు. రావికోనకు చెందిన పి.గిరి, ఒబ్బిడికి చెందిన కె.దమన్న, కురుపాంకు చెందిన ఎం.హర్ష, కె.శరణ్య, జి.ఆకాంక్ష స్వర్ణ పతకాలు సాధించగా, రావికోనకు చెందిన టి.నరసన్నారావు, బిన్నిడికి కె.బన్నీ, కురుపాంకు చెందిన డి.అరుణ్, ఆర్.రామ్ కిరణ్, బయ్యాడకు చెందిన ఎన్.భవ్యశ్రీ, వెండి పతకాలు సాధించగా వీరందరికీ కూడా శుక్రవారం కురుపాం ఎస్సై సిహెచ్ ప్రసాద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్ కె.నరేష్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు, వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

జిల్లా ఇమ్యూనికేషన్ అధికారి (డిఐఒ) టి.జగన్మోహనరావు తన జన్మదినం సందర్భంగా శుక్రవారం మండలంలో గల పెళ్లివలస గిరిజనుల మధ్య కేక్ కట్ చేశారు. అనంతరం ఆ గ్రామ గిరిజనులకు ఐదు రకాల నిత్యావసర సరుకులు, బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఏటా ఆనవాయితీగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నన్నారు. ఎంతో మంది అనాథలకు, ఆపన్నులకు మనం చేసే కొద్ది సేవ కూడా ఆదుకొనే అవకాశాలు ఉన్నాయన్నారు. ఉపాధి కరువై అన్న వస్త్రాలు సైతం లేని కుటుంబాలు ఎన్నో ఉన్నాయని, అలాంటి వారికి ఏ చిన్న సాయం అందజేసినా ఆనందంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గిరిజన ప్రజలు పాల్గొన్నారు.


పేదలకు బట్టలు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న జగన్మోహనరావు

గిరిజన నేస్తం విప్పపువ్వు..

విప్పపువ్వులో ఔషధ గుణాలు
గిరిజనులకు ఆదాయ వనరు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజనుల మోహులు (విప్ప) పువ్వుల్లా వికసించే కాలం. గుమ్మలక్ష్మీపురం మన్యంలో ఏ గిరిజన గూడెంకి వెళ్లినా విప్ప పూల పరిమళం వెదజల్లుతోంది. అందమైన ప్రకృతిలో ఉదయం పూట నడుస్తూ ఉంటే పాదాలకు మెత్తని పూలు తాకుతుంటాయి. తల పైకెత్తి చూస్తే దట్టమైన పువ్వులు దర్శనమిస్తాయి. గిరి పుత్రికలు రాలిన పూలను అంటిన మట్టిని సుతారంగా తుడిచి జాగ్రత్తగా వెదురు బుట్టల్లోకి వేస్తుంటారు. విప్ప పువ్వు అడవి ప్రాంత ప్రజల బతుకుదెరువు.

విప్ప పువ్వులో దివ్యౌషధ గుణాలు కలిగి ఉన్నాయి. విప్పపువ్వు వినియోగించేవారు విశేషమైన ఆరోగ్య లాభాలు పొందుతారు. ముఖ్యంగా కీళ్ల నొప్పులు, ఒళ్లు పట్టు వాతాలకు దివ్యౌషధం విప్ప పువ్వు. విప్ప చెట్లకు ఓ జీవన చక్రం ఉంటుంది. ఫిబ్రవరి నుండి ఏప్రిల్ వరకు ఆకురాలే కాలం ఆ సమయంలోనే ఘాటైన పరిమళంతో పూలు వికసిస్తూ ఉంటాయి. మార్చి నుంచి మే వరకు పూలు రాలే కాలం. ఒక చెట్టు నుంచి సుమారు 100 కిలోల పూలు రాలుతాయి. ప్రతి పువ్వును గిరిజనులు జాగ్రత్తగా ఒడిసి పట్టుకుంటారు. ఎందుకంటే వాళ్ల బతుకంత విప్ప పువ్వుతోనే ముడిపడి ఉంటుంది. పిల్లాపాపలతో గిరిజనులు పూల సేకరణ కోసం తెల్లవారుజామున అడవికి బయలుదేరి వెళ్తారు. పొద్దు తిరుగుడు పూలు సూర్యుడి కోసం చూసేచూడనట్టు రాలిపడే పూలు కోసం ఎదురుచూస్తామని గిరిజన మహిళలు అంటున్నారు. అలా ఒక్కొక్కరు 5 నుంచి 10 కిలోల వరకూ సేకరిస్తామని వాటిని ఎండబెట్టి తర్వాత బుట్టల్లో నింపి ఇంటి గుమ్మంలో దాచుకుంటామన్నారు. విప్పపువ్వుతో నానబెట్టిన బియ్యాన్ని కలిపి అన్నం వండుకుంటామని, బెల్లం కలిపి ఉండలు చేసుకుంటామని తెలిపారు. విప్ప పువ్వును దగ్గు, శ్వాసకోశ వ్యాధులకు వాడుతుంటామని తెలిపారు. విప్ప కాయలను పొడిచేసి పాలలో కలుపుకుని గిరిజన మహిళలు తాగుతారు. దీనివల్ల బాలింతలు చనుబాలు వృద్ధి అవుతాయని అంటారు. విప్పపువ్వులు దేవతలకు మహా ఇష్టం అని గిరిజనులు గ్రామ దేవతలకు నైవేద్యంగా సమర్పిస్తామంటున్నారు. ఈ వేసవి కాలంలో విప్ప పూలను సేకరించి జీవనోపాధి అమ్మి లాభాలు పొందాలని ఆశిస్తున్నట్టు గిరిజనులు తెలిపారు. ఈ ఏడాది జీడి పంట సరైన దిగుబడి లేకపోవడంతో గిరిజనుల ఆశలన్నీ విప్పపువ్వు మీదే ఉన్నాయి. విప్ప పువ్వుతో ఆయుర్వేదిక్ మందులు, నూనె లడ్డు, హల్వా, కేకులు తయారు చేస్తుంటారు. దీంతో విప్పపువ్వుకు బాగా డిమాండ్ పెరిగింది. బయట మార్కెట్లో కిలో విప్పపువ్వు రూ.25 ధర ఉంది.


రోడ్డు మీద ఆరబెడుతున్న ఇప్పపువ్వు


రహదారిపై నిలిచిపోయిన మురుగునీరు

నడవాలంటే నరకయాతన

ప్రజాశక్తి-పాలకొండ

నడవాలంటే నరకయాతన తప్పదు. అలాగే చుట్టూ ప్రజలు నివసిస్తున్న వారికి ఇబ్బందులు తప్పవు. అయినప్పటికీ ఏ ఒక్కరు పట్టించుకోరు. ఇది ఎక్కడో కాదు పట్టణంలో సనారివిశ్వేశ్వరస్వామి ఆలయం దగ్గర. సూర్యప్రకాశం గోర్ల్ అనే రహదారి పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు వెళ్లడానికి ఆ రహదారి ఆధారం. అదే విధంగా లుంబూరు, ఓని గ్రామాలకు వెళ్లేందుకు కూడా అదే రహదారి ఆధారం. దీంతో ఎంతో ప్రాధాన్యత ఉన్న రహదారి అధ్వాన్నంగా ఉంది. 17, 18, 19 వార్డులకు ఈ రోడ్డే ఆధారం. దీంతో పాటు ఆ రహదారికి ఆనుకుని వార్డు సచివాలయం ఉంది. రోజుకు వేలాది మంది నడిచే రహదారి అధ్వాన్నంగా ఉండడంతో ప్రజలకు ఇబ్బందిగా మారింది. చుట్టుపక్కల వారు పరిస్థితి దయనీయంగా ఉంది. వర్షం నీరు నిలిచిపోవడంతో పాటు కాలువలో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. దీంతో రహదారి పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. ఇప్పటికైనా స్పందించి రహదారి పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని నిరసన

ప్రజాశక్తి - పాచిపెంట



నిరసన తెలుపుతున్న గిరిజనులు

తంవ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎపి గిరిజన సంఘం, సిఐటియు ఆధ్వ ర్యంలో మండలంలోని ఒడిసెలమడ గిరిజనులు శుక్రవారం నిరసన చేపట్టారు. గిరిజన సంఘం నాయకులు సొయ్యారి వెంకన్న, తామల పైడిరాజు మాట్లా డుతూ కుడుమూరు జంక్షన్ నుంచి ఒడిసెలమడ వరకు రహదారి నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదని అన్నారు. దీని వల్ల చిన్నపాటి జ్వరాలకు వైద్య సదుపాయం అందక ప్రాణాపాయం వరకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. గర్భిణులను తీసుకువెళ్లడం చాలా కష్టంగా ఉందని కలెక్టర్‌తో పాటు ఉమ్మడి జిల్లాల అధికారులకు అనేకసార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రహదారి నిర్మాణం చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులు కోరారు. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ ఒడిసెలమడకు రోడ్లు లేకపోతే విద్య, వైద్యం అందక గిరిజనులకు అభివృద్ధి అందక వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఒడిసెలమాడ గ్రామానికి రోడ్డు యుద్ధ ప్రాతిపదిక వేసేలా చర్యలు చేపట్టాలని లేదంటే ఆందోళన చేపడుతామని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కొర్ర శ్రీనివాసరావు, లక్ష్మి, అమ్మన్న, సొయారి దాసు, తామల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.


భూ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ సత్యం

భూ అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో ధారభలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న భూ అభివృద్ధి పనులను ఎంపిడిఒ కొండపల్లి సత్యం శుక్రవారం మస్తర్ తనిఖీ చేపట్టారు. ఉపాధి పనులు అన్ని గ్రామాల్లో జరిగేలా చూడాలన్నారు. సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. 272 కూలి గిట్టుబాటు జరిగేలా కొలతలు ఇవ్వాలని ఆదేశించారు. ఆయనతో పాటు ఎపిఒలు బాబురావు, సాగర్ తదితరులు ఉన్నారు.

వైఎస్ఆర్ జలకళ అమలు జాడెక్కడ?

ప్రజాశక్తి - కొమరాడ

వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రారంభించిన వైఎస్ఆర్ జలకళ పథకం కింద ఈ నాలుగేళ్లలో ఒక్క బోరు కూడా వేయలేదని, అ పథకం జాడెక్కడని సిఐటియు, రైతు సంఘం నాయకులు కొల్లి సాంబమూర్తి, ఉపేంద్ర ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో వారు మాట్లాడుతూ వైఎస్ఆర్ జలకళ పథకం కింద వ్యవసాయ బోర్లు కోసం 240పైగా రైతులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఇందులో 12మంది రైతులు వరకు వైఎస్ఆర్ జలకళ ప్రారంభిస్తామని చెప్పి బోర్ వెల్ యజమాని వద్దకు ఈ 12 దరఖాస్తులు కూడా పంపించడం జరిగిందని, తీరా నాలుగేళ్లయినా ఒక్క బోరు కూడా రైతులకు తీయకపోవడం చాలా అన్యాయమని అన్నారు. జియ్యమ్మవలస మండలం పరసపాడులో మాజీ డిప్యూటీ సిఎం పి.పుష్పశ్రీవాణి జలకళ కింద బోరు ప్రారంభించారు తప్ప నేటికీ నియోజకవర్గంలో ఎక్కడా జలకలకు సంబంధించిన బోర్లు తీయని పరిస్థితి ఉందని అన్నారు. కావున వైఎస్ఆర్ జలకలకు దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు బోరు మంజూరు చేసి అన్ని విధాలా ఆదుకోవాలి వారు కోరారు.


పుస్తక పఠనం చేస్తున్న చిన్నారి

కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి బివెంకట్రావు మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞానం పెంపొందించేందుకు రకరకాల పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు. వేసవిలో పిల్లలు ఎటువంటి చెడు తిరుగులు తిరిగేందుకు వీల్లేకుండా గ్రంథాలయాల్లోనే రకరకాల ఆటల పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందజేస్తున్నామన్నారు. శిక్షణలో పిల్లలు ఆసక్తి కనిపిస్తున్నారని ఆయన అన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

మండలంలో వెలగవాడ సచివాలయం పరిధిలో సిరికొండ యర్ర చెరువులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం ఎంపిడిఒ డొంక త్రినాధులు పరిశీలించారు.. ఉపాధి పనులు సక్రమంగా చేపట్టాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేపట్టి గిట్టుబాటు వేతనం పొందాలన్నారు.

నవరత్నాలతో ఇంటింటికీ సంక్షేమం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

నవరత్నాలు పథకం ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకం అవినీతికి తావు లేకుండా, నేరుగా లబ్ధిదారుని ఖాతాలకే అందిస్తున్న ప్రభుత్వం తమదేనని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శుక్రవారం మండలంలోని తాళ్లబురిడిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జెడ్‌పిటిసి బలగ రేవతమ్మతో కలిసి పాల్గొన్న ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఈ నాలుగేళ్లలో రెండున్నర లక్షల కోట్ల రూపాయలకు పైగా పేదలకు పంచారన్నారు. అంతేకాక అర్హులైన ప్రతి కుటుంబానికి విద్య, వైద్యం, సంక్షేమం పథకాలు చేరేలా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి వారికి వాలంటీర్ల వ్యవస్థతో అనుసంధానం చేసిన ప్రభుత్వం తమదని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శోభారాణి, ఎఎంసి చైర్మన్ భాగ్యలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు లక్ష్మి, నాయకులు భీమవరపు కష్ణమూర్తి, బలగ నాగేశ్వరరావు, బొమ్మి రమేష్, చందాన శివాజీ, మర్రాపు వాసు తదితరులు పాల్గొన్నారు.


గ్రామస్తులకు కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

వ్యవసాయ పనిముట్లు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని వాటర్ షెడ్ మేనేజ్మెంట్‌కు సంబంధించిన రైతులు ప్రభుత్వం అందించిన వ్యవసాయ పరికరాలను సక్రమంగా వినియోగించుకోవాలని ఎంపిపి కె.దీనమయ్య కోరారు. శుక్రవారం ఆయన స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గిరిజన వాటర్ షెడ్ మేనేజ్మెంట్ రైతులకు వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వాటర్‌షెడ్ 2.0 పరిధిలోని గుమ్మలక్ష్మీపురం ప్రాజెక్ట్‌కు సంబంధించిన పిఎస్ఐ ఇంప్లీమెంట్స్‌ను వాటర్‌షెడ్‌లోని ఎల్విన్ పేట, లక్కగూడ, గుమ్మలక్ష్మీపురం రైతులకు పంపిణీ చేశామని అన్నారు. వాటర్ షెడ్ డెవలప్మెంట్ కంపోనెంట్ ప్రధాన మంత్రి సించాయి యోజన 2.0. గుమ్మలక్ష్మీపురం ప్రాజెక్ట్, మండల పరిధిలోని 10 పంచాయతీలకు గానూ 7 మైక్రో వాటర్ షెడ్లలో పిఎస్ఐ (15శాతం)లో భాగంగా రూ.1.59 కోట్లుకు గాను సుమారు రూ.72 లక్షలతో వాటర్ షెడ్ రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లను అందిస్తున్నామన్నారు. ఈ మేరకు మండలంలో 1046 యూనిట్లు మంజూరు అయ్యాయని అన్నారు. దీనిలో భాగంగా టార్పాలిన్లు, 715, బ్యాటరీ స్ప్రేయర్స్ 76, టైవాన్ 77, ఫుట్ స్ప్రేయర్స్ 5, ఆయిల్ ఇంజిన్లు 77 చొప్పున పంపిణీ చేశామన్నారు. అనంతరం వాటర్ షెడ్ కమిటీ చైర్మన్ ఎ.చెన్నారావు మాట్లాడుతూ వాటర్ షెడ్ ప్రోగ్రామ్ ద్వారా గిరిజన ప్రాంత రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు, వారు కోరిన విధంగా అందించడం సంతోషకరమని అన్నారు. వాటర్ షెడ్ మేనేజ్మెంట్ ప్రాజెక్టు అధికారి రెడ్డి పోలినాయుడు మాట్లాడుతూ పిఎస్ఐ ద్వారా మంజూరైన వ్యవసాయ పనిముట్లను సక్రమంగా వినియోగించుకుంటూ ఆర్థికంగా బలోపేతం కావాలని, వాటర్ షెడ్ ద్వారా జరుగుతున్న పనులను భూగర్భ జలాలను పెంపొందించడం తో పాటు వ్యవసాయనికి వినియోగించు కోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.సాల్మన్ రాజు, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, మండల సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు బొత్తాడ గౌరీశంకర్రావు, డిఎం ఆగ్రోస్ పార్వతీపురం, వాటర్ షెడ్ సిబ్బంది, సెక్రటరీలు, బిడ్డిక నాగేశ్వరరావు, వాటర్‌షెడ్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేస్తున్న ఎంపిపి దీనమయ్య

గుడి తొలగించొద్దని నిరసన

ఆర్‌టిసి అధికారుల తీరుపై మండిపాటు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణంలో నిర్మించిన త్రినాధ స్వామి దేవాలయాన్ని వెంటనే తొలగించాలని ఆర్టీసీ అధికారులు శుక్రవారం మధ్యాహ్నం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆర్‌టిసి కాంప్లెక్స్ ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన స్వామి దేవాలయంలో ఉన్న దేవుని పటాలను తీసుకువెళ్లారు. దీన్ని నిరసిస్తూ గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్రావు, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గత 40 ఏళ్ల నుంచి ఉన్న దేవాలయాన్ని తొలగించమంటూ ఆర్‌టిసి అధికారులు డిపిటిఒ సుధాకర్ ఆదేశాలు జారీ చేయడం సరైంది కాదన్నారు. హిందూ మనోభావాలను దెబ్బ చేసేలా ఆర్టీసీ అధికారులు ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌టిసి అధికారుల దౌర్జన్యం సరికాదంటూ అసహనం వ్యక్తం చేశారు. గత 40 ఏళ్ల నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ అభివృద్ధిని కనీసం పట్టించుకోని అధికారులు, తాగునీరు, మరుగుదొడ్లు మెరుగుపర్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆర్టీసీ అధికారులు ఇప్పుడు గుడి నిర్మాణంపై దృష్టి సారించి తొలగించడానికి సరికాదన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి గుడిని తొలగించే ప్రక్రియ మానుకోవాలని కోరారు.


నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

పేదింటి పెళ్లికి వితరణ

ప్రజాశక్తి - మక్కువ

మండలలోని వెంకటభైరిపురంలో పేదింటి పెళ్లి కూతురు ఏనుగుల శిరీషకు పెళ్లి కానుకగా రూ.10వేలు , చీర జాకెట్, పసుపు, కుంకుమను ఎంఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు మరడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ మరడ వెంకటరత్నం అందజేశారు. ఈ మేరకు వధువు తల్లిదండ్రులు శ్రీనివాసరావుకు, సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నవధాన్యాల కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో రస్తాకుంటుబాయి, ఆర్ బి కే కేంద్రంలో ఎపిసిఎన్ సిబ్బంది 30 రకాల విత్తనాలతో కూడిన నవధాన్యాల కిట్లును శుక్రవారం సర్పంచ్ ఎ.సునీత చేతుల మీదుగా రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు నవధాన్యాలు సాగు చేసి ప్రకృతి వ్యవసాయానికి నాంది పలికేలా ఉండాలన్నారు. నవధాన్యాలు సాగు చేయడం వల్ల నేల తల్లికి బాగుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎపిసిఎన్ సిబ్బంది ఎస్.భాస్కరరావు, గొర్లి తిరుపతిరావు, బి.నందిని, ఎన్.కృష్ణవేణి, ఎ.రవి, రైతులు పాల్గొన్నారు.


రైతులకు నవ ధాన్య విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సునీత

వెంకటనాయుడు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గడ్లప్ప గ్రామానికి చెందిన టిడిపి నాయకులు బచ్చ వెంకటనాయుడు తల్లి మహాలక్ష్మి శుక్రవారం మరణించింది. విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే బి.చిరంజీవిలు, మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు కె.తిరుపతిరావు, ఆర్.వేణుగోపాల్ నాయుడు, మండల పార్టీ నాయకులు బి.శ్రీనివాసరావు, ఎస్.హరిగోపాలరావు, ఎస్.శ్రీనివాసరావుతో పాటు గ్రామం వెళ్లి అతను కుటుంబాన్ని పరామర్శించారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో ఆటో ఢీకొన్న సంఘటనలో రాణి పేటకు చెందిన ఆడప షన్ముఖరావు తలకు తీవ్ర గాయాలైనట్లు స్థానిక ఎస్ఐ ఎ.నీలకంఠరావు శుక్రవారం తెలిపారు. విజయనగరం నుండి తన స్వగ్రామమైన రాణిపేటకు ద్విచక్ర వాహనంపై గురువారం వెళ్తుండగా పులిపుట్టి సమీపంలో భారతి ఇంటర్నేషనల్ స్కూల్ సమీపంలో కొత్తూరు వైపు నుండి సీతంపేట వైపు వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో షన్ముఖరావు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.